

# పసిడిమనసులు - షర్మిల



## అమ్మ కోసం

అమ్మ అంది "నువ్వు అందరి కధలు రాశావు మరి నా కథ రాయవా ?" అని ...

“నీ గురించి రాయడానికేముంది? నువ్వో అమ్మవి. 14 ఏళ్ల కే పెళ్లయితే17 ఏళ్ల కే నన్ను కన్న లేత తల్లివి. పాల బుగ్గల ప్రాయం వీడకముందే పాలిచ్చే తల్లివయ్యావు.

5 నెల్ల బిడ్డని అత్తమామలకు అప్పచెప్పి నాన్న, నువ్వు వెళ్లారే గానీ నీ కన్న పేగు నా వైపు లాగే వుంటుంది .

నువ్వు మాత్రం ఏం చేస్తావు ! దేశం కోసం పని చేసే సిపాయి అర్ధాంగివి దేశ సరిహద్దులదాకా వెళ్లాలిగా .. నీకు తెలుసు నువ్వు నీకన్నా బాగా నన్ను లాలించే చేతుల్లో పెడుతున్నావని .

చల్లని చిట్టెమ్మ తల్లి అదే నా నాయనమ్మ ఆనాటి యశోదమ్మను మించి నన్ను సాకింది .

పదేళ్లు ఇట్టే గడిచాయి మళ్లీ నీ చెంతకి చేరాను . జిజియాభాయి శివాజీ కి వీరత్వం వుగ్గు పాలతో రంగరించి పోసిందట. నువ్వు మాత్రం తక్కువ తిన్నావా మమ్మల్ని కూర్చో బెట్టుకుని మహాప్రస్థానం, వెన్నెలకురిసిన రాత్రి , గోర్కీ అమ్మ చదివి వినిపించేదానివి.

జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నా కష్టాల్లోనూ సుఖాల్లోనూ నీ ముఖంపై చెదరని చిరునవ్వు. నీ నవ్వులో వెన్నెల కురిసిన చల్లదనం . మీ అమ్మ ఎంత బాగుంటుందో అని ఫ్రెండ్స్ అంటే గర్వంగానూ వుండేది .

నువ్వు కూచిపూడి నాట్యం వెంపటి చినసత్యం గారి దగ్గర నేర్చుకున్నావ్. నీ నాట్యం పెళ్లివల్ల ప్రదర్శనల వరకూ వెళ్లలేదని నేను నీతో మళ్లీ ప్రదర్శన ఇప్పించాలని ఎంత బతిమాలినా నువ్వు బాగోదేమో ఈ వయసులో అన్నావ్. అప్పుడు నీ వయసు35 ఏళ్లు.

మహ్మద్ రఫీ పాటలంటే నీకు ప్రాణం. రఫీ చనిపోయినప్పుడు నువ్వు ఏడ్వడం నాకిప్పటికీ గుర్తే . నాన్నా నువ్వు కలిసి భీంసేన్ జోషీ . మంగళంపల్లి బాలమురళిల జుగల్ బందీ వింటూ మైమరిచి పోయేవారు.

పూవూ తావీ కలిసి వున్నట్టు నీ మనసు ఎప్పుడూ నాన్నని అల్లుకుని వుండేది. నా ఫేవరెట్ హీరో కమల్ హాసన్ మరి నీకు అని అడిగితే నాకే హీరోలు నచ్చరే ! మీ నాన్నే నా హీరో అంటే నాకెంత నవ్వొచ్చేదో. అమ్మా నీకింకో ప్రపంచం లేదు. మేమే నీ ప్రపంచం .

పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలన్న నీ ఆశయం నిన్ను ఎన్ని విమర్శలపాలు చేసిందో...

17 ఏళ్లకే నా ప్రేమ విషయం చెప్పినా పల్లెత్తు మాట అనని నా పిచ్చి తల్లివి నేనే వెళ్లి నా పెళ్లి చేసుకుంటే ముహూర్తం టైముకి అలారం పెట్టుకుని ఏడ్చావు. అమ్మ మనసు నేను అమ్మనయితే గానీ అర్ధం కాలేదు.

ఈ ప్రపంచంలో నేను ఏ చిన్నది సాధించినా మా అమ్మకి ఎంత గొప్పో .

అమ్మ కళ్లకి నేనో హీరోయిన్ని . అమ్మా ఈ రోజేమైందంటే అని చిన్నప్పుడు కాలేజీవి , పెద్దయ్యాకా నా ఆఫీసు విషయాలు చెప్తే వినే శ్రోత అమ్మే .

నా వీక్లీ ఆఫ్ రోజు అమ్మ దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుంటే గేటు వరకూ వచ్చి " మళ్లీ ఆఫ్ రోజు వస్తావా " అని అడిగితే అమ్మా ! ఇంకా ఈ రోజు ఇప్పుడేగా అయ్యింది వచ్చేవారం సంగతి ఇప్పుడెందుకే " అని విసుక్కున్నా ప్రతివారం మళ్లీ మామూలే . తల్లి మనసంతేనేమో .

నాకు ఏ కష్టమన్నా వస్తే నాతోనే అమ్మ. నా పిల్లలు రాత్రంతా ఏడిస్తే నేను పడుకుంటే నువ్వు నిద్ర మానుకున్న సంగతి నేనెలా మరిచిపోతాను.

నేను ఆనందంగా వుంటే అమ్మకి ఏనుగెక్కినంత సంబరం. నేనే కష్టంలో వున్నా అమ్మ నా వెంటే .

అమ్మా నీ గురించి ఏం రాయమంటావ్. నీ అందమైన దేహంలో భాగమిచ్చావు. నీ అపురూపమైన ఆలోచనల సారాన్ని పాలుగా తాగించావు .

నా గురించి ఏమీ రాయవేమే అంటావు . అమ్మా నువ్వు నా కథకి వస్తువ్వి కాదు ... నువ్వే ప్రేరణవి అసలు నువ్వే నేను . నేను ఏం రాసినా నా పెన్నులో సిరా నువ్వే కదా అమ్మా.”

*(వచ్చేనెల మరో కథ)*

COMMENTS